
# నవభూమి



## జిల్లా అనుబంధం

11 ఫిబ్రవరి,2025 మంగళవారం పేజీలు:8

www.epaper.navabhoomi.in


# రాజకీయ పార్టీలు సహకరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన






**కొత్తగూడెం ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం, సారపాక గ్రామపంచాయతీలలో పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఆమోదం, అభ్యంతరాల స్వీకరణపై జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన అధ్యక్షతన సోమవారం ఐడిఓసి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం జనవరి 30వ తేదీన విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం భద్రాచలం, సారపాక గ్రామపంచాయతీలో పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఆమోదం, అభ్యంతరాల స్వీకరణ ఫిబ్రవరి 9 నుండి13వ తేదీ వరకు పూర్తి చేయుటలో రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. భద్రాచలం గ్రామపంచాయతీలో 41 వేల ఎనిమిది మంది ఓటర్లు కు గాను 60 పోలింగ్ కేంద్రాలు మరియు సారపాక గ్రామపంచాయతీ పరిధిలో 19045 మంది ఓటర్ల కు గాను 36 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. 11వ తేదీన మండల స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని, ఏదైనా పోలింగ్ కేంద్రాల గుర్తింపు లో అభ్యంతరాలు లేదా ఓటర్లకు దూరంగా ఉన్నట్లయితే లికిత పూర్వకంగా స్థానిక ఎంపీడీవోలకు 12వ తేదీన అభ్యంతరాల పరిశీలన ఫిబ్రవరి 14వ తేదీన తుది జాబితా విడుదల చేస్తామని ఆమె అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, నేషనల్ కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, సిపిఐ, సిపిఎం రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణికి ఇద్దరు కొత్త డైరెక్టర్‌లు

- ఎల్వి సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర రావు







**కొత్తగూడెం ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** సింగరేణి లో ఖాళీగా ఉన్న రెండు డైరెక్టర్ పోస్టులకు సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూ లో ఇద్దరిని ఎంపిక చేశారు. సింగరేణి డైరెక్టర్ లు గా శ్రీరామపూర్ జీ ఎం ఎల్వి సూర్యనారాయణ, ఆడ్రియాల్ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు.ఒకరిని డైరెక్టర్ ఆపరేషన్స్‌గా, మరొకరిని డైరెక్టర్ ప్రాజెక్టు ప్లానింగ్‌గా నియమించారు. సింగరేణి నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.కాగా ఎంపికైన డైరెక్టర్లను ఐ ఎన్‌టీయూసి సెక్రటరీ జనరల్ జనకప్రసాద్ సన్మానించారు

## తునికాకు టెండర్ల జాప్యంపై
# ప్రభుత్వం స్పందించాలి

- తక్షణమే ప్రూనింగ్ పనులు చేపట్టాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**కొత్తగూడెం ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులకు, గిరిజనేతర పేదలకు రెండో పంటైన తునికాకు సేకరణపై జరుగుతున్న జాప్యంపై ప్రభుత్వం స్పందించి తక్షణమే టెండర్లు ఆహ్వానించి ప్రూనింగ్ పనులు చేపట్టాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్లో అయన మట్లాడుతూ తునికాకు సేకరణ ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల లాభాన్ని ఆర్జించిపెడుతున్న తునికాకు సేకరణకు టెండర్లు ఆహ్వానించి ప్రూనింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా ప్రభుత్వం నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. మోడెం పనులు జాప్యం జరిగితే ఆకు నాణ్యత లోపించి ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అష్టకష్టాలు పడి, ప్రమాదపుటంచున ఆకు సేకరిస్తున్న కార్మికులకు గిట్టుబాటు ధర చెల్లించాల్సిన అవసరం ప్రభుత్వం ఉందని, యాభై ఆకుల కట్టకు రూ.మూడు రూపాయలు చెల్లించాలని, బకాయి బోనస్ తక్షణమే పూర్తి స్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తునికాకు సేకరణ జాప్యంపై సంబంధిత శాఖ మంత్రికి లేఖ పంపినట్లు అయన తెలిపారు. జిల్లాలో తునికాకు సేకరణకు తక్షణమే టెండర్లు ఆహ్వానించి మోడెమ్ పనులు చేపట్టాలని తద్వారా ఏజెన్సీ గిరిజనులకు, గిరిజనేతర పేదలకు వేసవి పంట ద్వారా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సిపిఐ, ఏఐకెఎస్, బికెఎంయు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- అధికారులు సమయపాలన పాటించాలి
- ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ





**ఖమ్మం నవభూమి బ్యూరో, ఫిబ్రవరి10:** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, డి.ఆర్.ఓ. ఏ. పద్మజ, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, అనుమతి లేకుండా గైర్హాజరు అయిన అధికారులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు సమాచారం అందించి వారి అనుమతి లేకుండా జిల్లా అధికారులు హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులకు శాఖాపరమైన సమావేశాలు హైదరాబాద్ లో ఏవైనా ఉంటే ముందుగా జిల్లా యంత్రాంగం అనుమతి తీసుకోవాలని, ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు ఉదయం సమయానికి వచ్చి అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో లేని సమయంలో, సీనియర్ అధికారి ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని, ప్రజలతో మర్యాదగా, జవాబుదారీతనంతో ప్రవర్తించాలని అన్నారు. ప్రజావాణికి సంబంధించి వచ్చిన అర్జీలను పరిశీలన చేసి పెండింగ్ లో లేకుండా అర్జీలను వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఖమ్మం నగరం పాకబండ బజార్ కు చెందిన జి. జాన్సీ తన కుమార్తె భవానికు శాశ్వత దృష్టి లోపం ఉందని, తన కూతురుకు 100 శాతం దృష్టి లోపం ఉన్నందున 100 శాతం వైకల్యంతో సదరం సర్టిఫికెట్ జారీ చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కు రాస్తూ పరీక్షించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరానికి చెందిన బి. వినయ్ కుమార్ తనకు వికలాంగుల కోటాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ పరిశీలించి అర్హత, అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం పుట్ట కోటకు చెందిన డి. నర్సమ్మ తాను గత 50 సంవత్సరాలుగా పోడు వ్యవసాయం చేస్తున్నానని, తనకు పట్టా పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్. అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేనిపై అవిశ్వాస తీర్మానం



**టేకులపల్లి ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** టేకులపల్లి మండలం బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ పై అవిశ్వాస తీర్మానాన్ని సోమవారం డిసిఓకి తొమ్మిది మంది సొసైటీ డైరెక్టర్లు అందజేశారు. అవిశ్వాస తీర్మానాన్ని అందజేసిన తొమ్మిది మంది సొసైటీ డైరెక్టర్లు కంభంపాటి శ్రీనివాస్, ఉల్లోజి ఉదయ్, కృష్ణార్జున రావు, దోర్నాల విజయ మోహనరావు, లక్కినేని శ్యామ్, బాలాజీ, కుమ్మరి లావణ్య, బానోత్ ఇస్తారి, చీమల లక్ష్మీనారాయణ ఉన్నారు.

# ట్రాలీ ఆటోలకు ప్రభుత్వ స్థలం కేటాయించేలా చూడండి

### ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్‌కు వినతి పత్రం



**సత్తుపల్లి, నవభూమి, ఫిబ్రవరి 10 :** పట్టణ పరిధిలో వున్న గుడ్స్ వెహికిల్స్ (3,4 టైర్ల ట్రాలీ ఆటోలు ) నిలుపుటకు ప్రభుత్వ స్థలం కేటాయించేందుకు తగు నిర్ణయం తీసుకోవాలని ట్రాలీ ఆటో ఓనర్స్, వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే డక్కరమట్ట రాఘవయ్య దయానంద్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు భానోత్ నందు నాయక మాట్లాడుతూ పట్టణ పరిధిలో 150 ట్రాలీ ఆటోలు, గుడ్స్ ఆటోలు ఉన్నాయన్నారు. వందలాది కుటుంబాలు వాటి ఆధారంగా చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. ఈ యూనియన్లో 3 చక్రాలు, 4 చక్రాలు గుడ్స్ ఆటోల లో వివిధ వస్తువులు రవాణా చేయటం ద్వారా వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబ పోషణ జరుగుతోందన్నారు. కిరాయిలు లేని సమయాలలో ఆటోలు నిలుపుకొనుటకు స్థలము లేకపోవడం వల్ల రోడ్డు ప్రక్కన దుకాణాల ఎదురుగా నింపుతున్నామన్నారు. మా ఆటోలు అలా నిలపటాన్ని అనేక మంది దుకాణాలు యజమానులు అభ్యంతరములు తెలుపుతున్నారన్నారు. ఆయా షాపుల వారి దయా దాక్షిణ్యాలతో ఆటోలు రోడ్డు ప్రక్కన నిలుపుకుంటూ కిరాయిలు వచ్చినప్పుడు వెళుతున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో ఆటోలు నిలుపుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించి ఆత్మగౌరవాన్ని కాపాడాలని వారు కోరారు

# పంట సర్వేను పరిశీలించిన వ్యవసాయ ఉప సంచాలకులు



**జూలురుపాడు, ఫిబ్రవరి 10 (నవభూమి ప్రతినిధి)** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పంట వివరాలను సర్వే చేసి డిజిటలైజేషన్ కార్యక్రమం చేపట్టినది. దానిలో భాగంగా మండలంలో వ్యవసాయాధికారి దీపక్ ఆనంద్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే కార్య క్రమాన్ని కొత్తగూడెం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారావు మండల వ్యాప్తంగా ఉన్న నాలుగు క్లస్టర్లలో సోమవారం మండల వ్యవసాయ అధికారి దీపక్ ఆనంద్ తో కలిసి డిజిటల్ క్రాఫ్ సర్వే జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ విస్తరణ అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా చూడాలని, సర్వే త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు గౌస్,గోపికృష్ణ,సరిత, విజయభాను, రైతులు పాల్గొన్నారు.

# కాపులకు కుల గణన నివేదిక న్యాయం జరగలేదని తెలంగాణ మున్నూరు కాపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, నవభూమి ప్రతినిధి-** కాపులకు కుల గణన నివేదిక న్యాయం జరగలేదని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య మాట్లాడుతూ విమర్శించారు సోమవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ44 లక్షలుఉన్న కాపులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

# అర్బన్ పార్క్‌ను ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మార్చి 15 నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో సెల్ఫీ పాయింట్‌లు ఏర్పాటు చేయాలి
- వెలుగుమట్ల అర్బన్ పార్క్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మంనగరం, నవభూమి, ఫిబ్రవరి10:** ప్రజలకు ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తో కలిసి, వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను సందర్శించారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ దగ్గర మెయిన్ రోడ్ నుంచి పార్క్ వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మెయిన్ రోడ్డు వద్ద వెలుగు మట్ల అర్బన్ పార్క్ గురించి తెలిసే విధంగా ఆర్చి ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనులు రెండు వైపుల నుంచి జరగాలని, మార్చి 15 నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ గురించి తెలిసేలా సమాచార బోర్డులను సమీకృత కలెక్టరేట్ బస్ స్టాప్ వద్ద ఏర్పాటు చేయాలని, అక్కడి నుంచి వెలుగుమట్ల అర్బన్ పార్కు వచ్చేందుకు వీలుగా వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని అన్నారు. అర్బన్ పార్కుకు ప్రత్యేకంగా బస్సు సర్వీస్ నడిపేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. హైదరాబాదులోని ప్రగతి రీసార్ట్ ను ట్రెడిషనల్ ప్లాంట్స్ తో ఆకర్షణీయంగా తయారు చేశారని, అదే రీతిలో వెలుగుమట్ల అర్బన్ పార్కును ఆకర్షణీయంగా రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని , ఒకసారి ప్రగతి రీసార్ట్ కు వెళ్లి పరిశీలించి రావాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ లో వీలైనంత అధికంగా బెస్ట్ వ్యూస్ కనిపించేలా సెల్ఫీ పాయింట్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. పర్యాటకులు ఇక్కడ ఫోటోలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం వల్ల మన పార్క్ కు మంచి గుర్తింపు రావాలని అన్నారు. పార్క్ లో సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు ప్రణాళిక తయారు చేయాలని, అవసరమైన సైకిల్స్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. పార్క్ కు ప్రజలు వచ్చి వన భోజనాలు చేసే విధంగా ఏర్పాటు ఉండాలని అన్నారు. పార్క్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వ్యూ పాయింట్ దగ్గర చేపడుతున్న నిర్మాణాలు పరిశీలించి, సూచనలు చేశారు. క్యాంటీన్ పూర్తి ప్లాస్టిక్ రహితంగా వుండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దశల వారిగా అర్బన్ పార్క్ పూర్తి స్థాయిలో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. వెలుగుమట్ల చుట్టూతా ఫెన్సింగ్ ఏర్పాటు పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, అటవీ బీట్ అధికారులకు యూనిఫామ్, షూస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, ఖమ్మం ఫారెస్ట్ రేంజ్ అధికారి జి. నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఏఈ అనిత, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.









# గిరిజన కుటుంబాల జీవనోపాధికి యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్

**భద్రాచలం జనవరి 10 నవభూమి ప్రతినిధి:** అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఐటీడీఏ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం నాడు ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారులో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి అర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు జీవనోపాధి పెంపొందించుకోవడానికి యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. సోమవారం వచ్చిన దరఖాస్తులలో పోడు భూములు సమస్యలు, రైతుబంధు రుణాలు, పోడు భూములకు సంబంధించిన పట్టాల కొరకు, వ్యవసాయానికి సంబంధించిన కరెంటు మోటారు కొరకు, ఇతర ఆర్థిక ప్రయోజనాల కొరకు, ట్రై కార్ సబ్సిడీ రుణాల కొరకు, నూతనంగా ఇసుక సొసైటీలు ఏర్పాటు కొరకు, సోలార్ విద్యుత్ కనెక్షన్ ఇప్పించుట కొరకు, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం అందించుట కొరకు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక వెసులుబాటు కల్పించుట కొరకు, కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్లు, వితంతు, ఒంటరి మహిళ పింఛన్లు ఇప్పించుట కొరకు గిరిజనులు దరఖాస్తులు సమర్పించారని ఆయన అన్నారు. గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలను ప్రత్యేకమైన రిజిస్టర్లో



ఆన్లైన్ ద్వారా నమోదు చేసి ప్రతి గిరిజన కుటుంబాలను విడతల వారీగా వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఏఓ సున్నం రాంబాబు, డిడి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, ఎస్ డి సి రవీంద్రనాథ్, ఎస్ ఓ ఉదయ భాస్కర్, ఏ పి ఓ పవర్ వేణు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఎల్ టి ఆర్ డిటీ మనిధర్, డి యం జి సి సి సమ్మయ్య,మేనేజర్ ఆదినారాయణ, మిషన్ భగీరథ ఏ ఈఈ నారాయణరావు, హెచ్ ఈ ఓ లింగ నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి, జేడీఎం హరికృష్ణ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్





**ఖమ్మం, క్రైం, నవభూమి, ఫిబ్రవరి 10 :** ఖమ్మం శివారు ధంసాలపూరం బ్రిడ్జి వద్ద తరచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఖానాపురం హవేలీ, ట్రాఫిక్ పోలీసులు, ఆర్ అండ్ బి అధికారులు సంయుక్తంగా సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వంతెనపై రోడ్డు ప్రమాదాల గల కారణాలు విశ్లేషించారు. ఇరువైపులా ప్రమాద సూచిక బోర్డులతో పాటు వంతెన పై రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ లిమిట్స్ బోర్డులు, డీప్ కర్వు బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తద్వార వేగాన్ని నియంత్రిస్తూ ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో పలు ప్రాంతాలలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ర్యాష్ డ్రైవింగ్ తో పాటు వంతెన కర్వు ఉన్న చోట సరియైన అంచనా వేయకపోవడం, మద్యం మత్తులో వాహనాలను నడపడం అన్నారు. వాహనదారులు ఖచ్చితంగా డ్రైవింగ్ సమయంలో అవగాహన, అప్రమత్తంగా వుంటే సురక్షితమైన ప్రయాణానికి దోహదపడుతుందని అన్నారు.కార్యక్రమంలో ఆర్అండ్ బి డివిజన్ ఇంజనీర్ జి. చంద్రశేఖర్, ఏఈ ప్రవీణ్, ఖానాపురం హవేలీ ఇన్స్‌పెక్టర్ భానుప్రకాశ్, ట్రాఫిక్ సిఐ మోహన్ బాబు పాల్గొన్నారు.

## రఘునందమ్మకు నివాళులు అర్పించిన, పాల్వంచ పాత్రికేయులు, పట్టణ ప్రముఖులు

**పాల్వంచ ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ పట్టణ కేంద్రంగా ఓ న్యూస్ ఛానల్ లో విలేకరిగా భాధ్యతలు నిర్వహిస్తున్న తోట రామకృష్ణ మాతృమూర్తి తోట రఘునందమ్మ గత నెల 29 న మృతి చెందారు. సోమవారం పట్టణ పరిధి లోని శ్రీనివాస కాలనీ లో గల అయన స్వగృహం లో దశదిన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు పాత్రికేయులు, పలువురు పట్టణ ప్రముఖులు హాజరై వారి ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు ఎండి జైనుల్లా బుద్దీన్, ఏ అబ్బురామ్, జి వీర భద్రం, వి కొండల రావు, టి శ్రీనివాస రావు, బి నాగేశ్వరావు, నజీర్, పట్టణ ప్రముఖులు కె బాలకృష్ణ, కె కనకేష్, సిహెచ్ వీరభద్రం, దాసరి నాగేశ్వరరావు, శీలం సమ్మయ్య గౌడు, బేతంశెట్టి విజయ్, బొమ్మినేని పృధ్వి చౌదరి, పూసగూడెం మాజీ సర్పంచ్ బాలు నాయక్ లతో పాటు మరి కొంత మంది పాల్గొన్నారు







# పాఠశాలలకు సరఫరా చేసే కంప్యూటర్ల పరిశీలన

■ **ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్**



**భద్రాచలం జనవరి 10 నవభూమి ప్రతినిధి:** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకునే బాల బాలికలకు చదువుతోపాటు కంప్యూటర్ ద్వారా మేధాశక్తి మరియు వారిలో దాగివున్న ప్రతిభను పెంపొందించుకోవడానికి ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థిని విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం నాడు పీఎంఆర్సి భవనంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయడానికి కొనుగోలు చేసిన కంప్యూటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు చదువుతోపాటు కంప్యూటర్ ద్వారా వారి మేధాశక్తిని పెంపొందించుకోవడానికి ఐదవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా ప్రత్యేకంగా ఆన్లైన్ తరగతులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు కంప్యూటర్ బేస్ లెవెల్, ఎక్సెల్ వర్డ్స్, మెయిల్స్, టైపింగ్, గేమ్స్, పజిల్స్, మైన్స్ పార్క్ ప్రోగ్రాం, పెయింటింగ్స్, కార్టూన్స్ మరియు ఇతర కంప్యూటర్ నాలెడ్జ్ కి సంబంధించిన అంశాలు కంప్యూటర్ ద్వారా విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం 90 కంప్యూటర్లు కంప్యూటర్లు లేని పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని, ఏ పాఠశాలకు కంప్యూటర్లు అందిస్తున్నామో పాఠశాల పేరు, గ్యారెంటీ కార్డు అందించి ఆ పాఠశాల కంప్యూటర్లు నిర్వహించే ఉపాధ్యాయులచే రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని డిడి ట్రైబల్ వెల్ఫేర్ కు ఆదేశిస్తూ విద్యార్థినీ విద్యార్థులు అందరికీ కంప్యూటర్ లో పరిజ్ఞానం పెంపొందించుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు రాజేష్, శేఖర్, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# సీఎం హామీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

■ **టీయూసిఐ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి**

■ **16న టీయూసిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి**

■ **రీజియన్ కార్యదర్శి పి సతీష్**



**కొత్తగూడెం ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టి యు సి ఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధమ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం కొత్తగూడెంలోని బంగ్లో స్, కాంట్రాక్ట్ కార్మికుల మస్టర్ అడ్డా వద్ద, పి ఎస్ సి డబ్ల్యూ యు, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి పి సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి పాల్గొని మాట్లాడుతూ ఈనెల 16న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధమ మహాసభ (ఉర్దూగర్) ఫంక్షన్ హాల్ లో జరుగుతుందని, ఈ మహాసభను జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు గత ఎనిమిది సంవత్సరాలుగా పెరగలేదన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం నయా పైసా వేతనం పెంచకుండా ముఖం చాటేసిందన్నారు. రేవంత్ రెడ్డి హామీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు తో పాటు సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తానని పిసిసి అధ్యక్షుడి హెూదాలో కోల్ బెల్టులో తిరిగినప్పుడు కార్మికులకు హామీ ఇచ్చారని అన్నారు.హామీ ప్రకారం పెరుగుతున్న ధరలు కనుగుణంగా కార్మికుల వేతనాలులేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వేతనాలు పెంచాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు గోనెల రమేష్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మిక చట్టాలు అమలు జరగడం లేదన్నారు. కాంట్రాక్టర్ కార్మికులకు ఆదివారం సెలవు తప్ప మరి ఏ పండుగ సెలవులు, జాతీయ పండుగ సెలవల్లో ఏ ఒక్క సెలవు లేదన్నారు. చేసిన మస్టర్లకు జీతమే సరిపోవ డంలేదు, అవసరాలకు నాగా చేస్తే కుటుంబం గడవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ నాయకులు కుంజ భాస్కర్, శంకర్ నాగక్క, సురేష్, మనెమ్మ, రోజా, శారద, సరళ, తార, మల్లేష్, ఆదిలక్ష్మి, సుజాత, రాజేశ్వరి, రామకృష్ణ, కాంతి తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన శాస్త్రం పట్ల పిల్లలు ఆసక్తిని పెంచుకోవాలి

■ **జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వరచారి**






**కొత్తగూడెం ఫిబ్రవరి 10 నవభూమి జిల్లా బ్యూరో:** విజ్ఞాన శాస్త్రం పట్ల పిల్లలను ఆసక్తి పెంచుకోవాలని, దానికి ఇలాంటి ప్రతిభాపాటవ పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వరా చారి అన్నారు. సోమవారం పాత కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో పోరమా ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్ పి ఎస్ టి) ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి భౌతికశాస్త్ర ప్రతిభాపాటవ పోటీల బహుమతి ప్రధానం ఉత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు భౌతిక శాస్త్రాన్ని ఆసక్తితో అభ్యసించి సమాజానికి అవసరమైన నూతన ఆవిష్కరణ చేయాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఇలాంటి ప్రతిభాపాట పోటీలలో పాల్గొనటమే ఒక గొప్ప విజయం గా భావించాలని, జయాపజయాలను సమానంగా స్వీకరించి ప్రస్తుత తప్పులను సరిదిద్దుకుంటూ జీవితంలో ముందుకు వెళుతూ ఉండాలని సూచించారు. ఈ పోటీలో జిల్లా ప్రథమ స్థానాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల టేకులపల్లి కి చెందిన ఎన్. గీత, ద్వితీయ స్థానాన్ని సారపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కే వల్లి శ్రీ అశ్విని, తృతీయ స్థానాన్ని భద్రాచలం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన వై. హాసిని కైవసం చేసుకొని, ఈనెల 12న హైదరాబాదులో రాష్ట్రస్థాయిలో జరిగే ప్రతిభాపాటవ పోటీకి ఎన్నికయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కార్యదర్శి ఎస్. మాధవరావు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి చలపతిరిజు, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్కే సైదులు, ఎఫ్ పి ఎస్ టి అధ్యక్షులు షేక్ అమిరుద్దీన్, ప్రధాన కార్యదర్శి బి. సంపత్ కుమార్, జిల్లాలోని అన్ని పాఠశాలల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## అంగన్వాడి చిన్నారులకు యూనిఫామ్ పంపిణీ చేసిన ఆర్‌జెడి



**ఎర్రుపాలెం, నవభూమి,ఫిబ్రవరి 10:** మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలోని అంగన్వాడి సెంటర్ ను ఆర్జెడి ఝాన్సీ లక్ష్మీబాయి సిడిపిఓ బాలా త్రిపుర సుందరితో కలిసి సోమవారం పరిశీలన చేశారు. సెంటర్లోని సమస్యలను,చిన్నారు లకు అందు తున్నపౌష్టికాహారంగురించి సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. అంగన్వాడి సెంటర్ లోని చిన్నారులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన యూనిఫామ్ దుస్తులను పంపిణీ చేశారు. శిథిలావస్థలో ఉన్న అంగన్వాడి సెంటర్ ను పరిశీలించి చిన్నారులకు ఇబ్బందులు ఉండడంతో సెంటర్ ను వెంటనే మార్చాలని, ప్రత్యామ్నాయంగా నూతన భవనంలోకి సెంటర్ ను మార్చే విధంగా ఆదేశించారు. ఆర్జెడి ఆదేశంతో సోమవారం సెంటర్ను ఏ సి డి పి ఓ కృష్ణ శ్రీ,సూపర్వైజర్ సునీతల ఆధ్వర్యంలో మార్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుజాత అంగన్వాడి సిబ్బంది,చిన్నారులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక బడ్జెట్

### కార్పొరేట్‌కు పెద్దపీట వేసిన కేంద్రం

### ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు

**ఖమ్మం, నవభూమి ఫిబ్రవరి 10:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని రైతులు, కార్మికులు పేద, మధ్యతరగతి ప్రజలను పూర్తిగా విస్మరించారని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు ఆరోపించారు. గతంతో పోలిస్తే కార్మిక వర్గానికి బడ్జెట్లో నిధుల కేటాయింపు తగ్గిందని సంక్షేమానికి కేటాయింపులు ఉన్న ఖర్చు చేసే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. ఏఐటియుసి ఖమ్మంజిల్లా సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శింగు నర్సింహారావు మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం వివిధ పథకాల ద్వారా రూ. 56వేల కోట్లు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.20436 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. గతంతో పోలిస్తే కేటాయింపుల్లో ఏడువేల కోట్ల రూపాయలు తగ్గాయన్నారు. బడ్జెట్కు ముందు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాటలు బడ్జెట్లో ప్రతి ఫలించలేదని నర్సింహారావు తెలిపారు. వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నిలుపుదల చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తుందన్నారు. సంక్షేమానికి నిధులు తగ్గించి సంపన్న వర్గాలకు, పెట్టుబడిదారులకు రాయితీలు ప్రకటించి సంపన్న వర్గాల పక్షపాతిగా మోడీ సర్కార్ మరోసారి నిరూపించుకుందని ఆయన తెలిపారు. మారిన పరిస్థితుల్లో ధరల పెరుగుదల, పెరిగిన జీవన వ్యయం నేపథ్యంలో ధరల నియంత్రణపై ప్రభుత్వం పట్టు కోల్పోయిందని ప్రైవేటు సంస్థలు కొనుగోళ్లు, అమ్మకాలను శాసిస్తున్నాయని ఆయన తెలిపారు. పోరాటాలకు సిద్ధం కావాలని పోరాటాలతోనే హక్కులు, సంక్షేమం అమలవుతుందని ఆయన తెలిపారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా సమావేశంలో కార్యనిర్వహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు సిహెచ్ సీతామహాలక్ష్మి, నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు జాకీరుద్దీన్, రాంబాబు, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 8 మందికి 2 రోజులు జైలు

**ఖమ్మం, క్రైం, నవభూమి, ఫిబ్రవరి 10:** ఖానాపురం హవేలీ పోలీసులు చేపట్టిన డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన ఎనిమిది మంది వాహనదారులకు రెండు రోజులు జైలు శిక్ష , ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు జరిమానా విధిస్తూ రెండవ అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయధికారి వై. బిందుప్రియ తీర్పు వెల్లడించారని ఇన్స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు. ఇటీవల ఖానాపురం హవేలీ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడ్డ వారిని కౌన్సిలింగ్ నిర్వహించి అనంతరం వారిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచామని తెలిపారు. ఎనిమిది మందికి రెండు రోజులు జైలు శిక్ష విధించడంతో పాటు రెండు వేల రూపాయలు జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన వారిలో ఎండి ఇమ్రాన్ ఖాన్, వీరాబాబు, టి. నాగభాశావ, టి.శ్రీనివాస్, నరసింహ, మిధున్, రాజు, క్రిష్ణరావు ఉన్నారు

## 16న కొత్తగూడెంలో టియుసిఐ ప్రథమ మహాసభ

- టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు గోనెల రమేష్
- సంఘటిత రంగంలో పనిచేసే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి







**పాల్వంచ ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** పట్టణ పరిధి లోని జి సి సి గోడౌన్ లో సోమవారం హమాలి కార్మికుల తో జనరల్ బాడీ నిర్వహించారు. ఈ సందర్భంగా టి యు సి ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్ మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా( టి యు సి ఐ)జిల్లా మహాసభలు కొత్తగూడెంలోని ఉర్దూఘర్ లో ఈనెల 16న నిర్వహిస్తున్నామని, మహాసభకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలి కార్మికులకు, వారి జీవితాలకు భద్రత కరువైందని అన్నారు. కార్మిక సంఘాలు గత సంవత్సరం కాలంగా హమాలి కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్, గాని ఎగుమతులు దిగుమతులు సంబంధించి పెంచుకున్నటువంటి రేట్లను గాని అమలు చేయకుండా తాత్సారం చేస్తుందని అన్నారు. తక్షణమే కార్మిక సంఘాలతో గత సంవత్సరం ఒప్పందం చేసుకున్నటువంటి పే రిగినటువంటి రేట్లను ఈ ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి సారథ్యంలోని ఈ ప్రభుత్వం సంఘటిత రంగంలో పనిచేస్తున్నటువంటి, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి ఎలాంటి భద్రత లేకుండా చట్టాలను సవరణ చేయడానికి పూనుకుంటుందన్నారు. ఈ చట్టసవరణలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలు దఫాలుగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించిందన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్నటువంటి ఈ కార్మిక చట్టాలను ఎన్నో ఏళ్ళు కార్మిక వర్గం పోరాడి సాధించుకుందని అన్నారు. ఇలాంటి చట్టాలను సవరణలు చేసి మన దేశంలో ఉన్న ఖనిజ సంపదను, కార్మికుల శ్రమను పది శాతం ఉన్న బడా పెట్టుబడి వర్గానికి కట్టపెట్టడానికి చట్ట సవరణలకు పూనుకుందన్నారు. కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల ఓట్లతో గద్దెనెక్కిన ఈ ప్రభుత్వాలు ఓడ ఎక్కేదాక ఓడ మల్లయ్య ,ఓడ దాటినంక బోడ మల్లయ్య అనే సామెత లెక్క కార్పొరేట్ దిగ్గజాలకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తూ వ్యవహరిస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఒక పక్క మతోన్మాదం పేరుతోటి అభ్యుదయ భావాలు కలిగిన వారిని, సామాజిక కార్యకర్తలను ప్రశ్నించే గొంతులపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ, ఈ ప్రజాస్వామ్యంలో దేశంలో ప్రజలకు రక్షణ లేకుండా చేస్తుందన్నారు. కార్మిక వర్గం పైన కర్షికవర్గం పైన సామాన్య ప్రజల పైన ముప్పేట దాడి కొనసాగిస్తున్న ఇలాంటి తరుణంలో ఈ దాడులకు వ్యతిరేకంగా, కార్మికుల హక్కుల రక్షణ కోసం ఎన్నో సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర కలిగిన టి యు సి ఐ మన జిల్లాలోని కొత్తగూడెంలో మహాసభలను నిర్వహించు కుంటుందన్నారు. ఈ మహాసభలకు సంఘటిత రంగంకార్మికులు, అసంఘటిత రంగం కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ పాల్వంచ ఏరియా నాయకులు, హమాలీ కార్మిక సంఘం నాయకులు కుంజా భాస్కర్, నాగేంద్ర, టి సుధాకర్, వెంకటేష్, వీరస్వామి, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు

## వెదురు సాగు చేసే రైతుల ఇంట సిరుల పంట

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** వెదురు సాగు చేయడం వల్ల రైతుల ఇంట సిరుల పంట పండినట్టేనని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం ఐ డి ఓ సి కార్యాలయం మినీ సమావేశ మందిరంలో ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో చంద్రుగొండ, ములకలపల్లి గుండాల మండలాల ఏపిఎం లు, ఏపీవోలు, సీసీలు, ఎఫ్ పి సీలు, వివో ఏసీలు మరియు అటవీ శాఖ సిబ్బంది కి వెదురు పెంపకం పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు లక్షల 18 వేల వెదురు సాగు లక్ష్యం ని కచ్చితంగా చేరుకోవాలని అందుకుగాను ఇండస్ట్రీస్ క్రాఫ్ట్ ఫౌండేషన్ వారు మన జిల్లాలో వెదురు సాగు చేయడానికి సులభమైన పద్ధతులు, వివిధ రకాల వెదురు సాగు, వెదురు సాగు వల్ల ఉపయోగాలు, వెదురు ఉత్పత్తులు తదితర వాటి మీద రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మన జిల్లాలో చంద్రుగొండ, ములకలపల్లి మరియు గుండాల మండలాలలోని భూములు వెదురు సాగుకు ఎంతో అనుకూలమని, అదేవిధంగా సాగుకు అవసరమైన నీటి వసతులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఎవరైతే ఐదు ఎకరాల వ్యవసాయం చేస్తూ బోరు సౌకర్యం వున్నఅటువంటి రైతులు ఒక ఎకరం వెదురు సాగు చేపట్టే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పెద్ద రైతులు వారికున్న భూముల్లో ఒక ఎకరం చిన్న రైతులు అర ఎకరం లోనైనా వెదురు సాగు చేపట్టాలని దాని ద్వారా రైతులు ఆర్థిక అభివృద్ధి చెందుతారు అన్నారు. మునగ మరియు వెదురు సాగు అన్ని సమస్యలకు పరిష్కారమని కలెక్టర్ అన్నారు. మునగ సాగు ద్వారా స్వల్ప కాలంలోనే ఆదాయం సమకూరుతుందని, వెదురు సాగు ద్వారా ఎఫ్ డి లా ఒక్కసారి పెట్టుబడితో నిరంతర ఆదాయం చేకూరుతుందన్నారు. వెదురు ను ఉపయోగించి కేవలం ఫ్లోరింగ్ మరియు ప్యానలింగ్ మాత్రమే కాకుండా ఇప్పుడు థర్మల్ విద్యుత్ కేంద్రాలలో బొగ్గు వినియోగంతో ఎక్కువ వాయు కాలుష్యం ఏర్పడుతుందని, దానికి బదులు వెదురు గుళికలు వినియో గించడం జరుగుతుంది అన్నారు. తద్వారా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు భారీగా వెదురు గుళికలు అవసరం పడు తున్నాయని, ఈ అవసరమే వెదురు సాగును లాభాల బాటలో నడిపించనుంది అని తెలిపారు. అంతేకాకుండా నంద్యాలలో పెద్ద సిమెంట్ ఫ్యాక్టరీ వారు వెదురు కొనుటకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మన జిల్లాలో జామాయిల్ సాగుకు సమానంగా వెదురు సాగు చేపట్టాలని, ఆ దిశగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ఆదివాసీల అభివృద్ధికి వెదురు సాగు ఒక్కటే మార్గమని వెదురు సాగు ద్వారా ఆదివాసీల సాంప్రదాయ వస్తువుల తయారీ చేపట్టవచ్చని, అదేవిధంగా పోడు వ్యవసాయంలో వెదురు సాగు చేపట్టేలా అటవీశాఖ అధికారులు ఆదివాసీలను ప్రోత్సహించాలని అన్నారు



## రైతు భరోసాపై రైతుల ఎదురు చూపులు



**ఎరుపాలెం,నవభూమి, ఫిబ్రవరి 10 :** మండలంలో మొత్తం16,990 మంది రైతు బందుకు అర్హులైన రైతులు ఉన్నారు.ఒక ఎకరం వరకు ఉన్న రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతిష్టాత్మంగా ప్రారంభించిన రైతు భరోసా పథకం ద్వారా మొదటి విడత పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలో మామునూరు గ్రామాన్ని ఎంపిక చేసి అదేరోజు ఆ రెవెన్యూ పరిధిలోని అర ఎకరంలోపు రైతులకు బ్యాంకు ఖాతాలో నగదు జమ చేశారు.మిగిలిన గ్రామాల్లో ఎకరం వరకు భూమి కలిగి ఉన్న రైతులకు రైతు భరోసా తాజాగా విడుదల చేయడంతో ఎకరం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఒక్కో ఎకరానికి పది వేలు మాత్రమే అందించగా కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరానికి ఎకరానికి 12 వేలు చొప్పున అందించే పథకానికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందించారు.దశలవారీగా అర ఎకరం నుండి ఎకరం,రెండు,ఆపైన ఉన్న రైతులందరికీ ప్రభుత్వం రైతుబంధు పథకం వర్తింప చేయనున్నడంతో మిగిలిన రైతులంతా ఆసక్తితో ఎదురుచూస్తూ ఉన్నారు.అన్ని గ్రామాల రైతులకు రైతు భరోసా ఎకరం వరకు విడుదల కావడంతో రైతులు సోమవారం బ్యాంకుల వద్ద బారులు తీరారు.ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు

## జర్నలిస్ట్ నాగబాబు కుమారుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా



**అశ్వారావుపేట టౌన్ ఫిబ్రవరి 10 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం వెలుగు రిపోర్టర్ కురిశెట్టి నాగబాబు నాయుడు కుమారుడు చిరంజీవి ఇటీవల అగ్ని ప్రమాదానికి గురికాగా కాలు భాగం కొంతమేరకు కాలింది. చికిత్స నిమిత్తం ఇంటి దగ్గరే ఉంటుండగా సోమవారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వారి గృహమును సందర్శించి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ ఎంపీపీ శ్రీరామమూర్తి, మోహన్ రెడ్డి, టౌన్ పార్టీ ప్రెసిడెంట్ సంపూర్ణ, శ్రీరామమూర్తి, చరణ్ ,హరికృష్ణ, విలేకరులు కృష్ణారెడ్డి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో సీపీఎం పార్టీ ప్రజా సంఘాలతో భారీ ఎత్తున ధర్నా

**హైదరాబాద్, ఫిబ్రవరి10, నవభూమి ప్రతినిధి-** ఇందిరా పార్కు ధర్నా చౌక్ లో సీపీఎం పార్టీ ప్రజా సంఘాల తో భారీ ఎత్తున ధర్నానిర్వ హించారు. ఆ ధర్నా లో వివి ధ ప్రజా సంఘాల తో పాటు తెలంగా ణ జానపద పరి రక్షణ జేఏసీ (సిని మా, సకల జాన పద కళలు, కళా కారుల సంక్షేమం) సంబంధించిన టీజేపీ జాక్ కళా కారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలం గాణ రాష్ట్రం లోని వివిధ జానపద కళలు, కళాకారు ల సంక్షేమం కోసం 500 కోట్ల రూపా యల బడ్జెట్ కేటా యించి తెలంగాణ జానపద డవలప్ మెంట్ కార్పొరేష న్ ఏర్పాటుచేయాలని. ప్రతి కళా కారునికి పెన్షన్ ఇవ్వాలని, గృహ వసతి, బస్ పాస్..

## ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన

# ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి

- పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
- అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్

**కొత్తగూడెం ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) డి. వేణుగోపాల్ ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు.

**గ్రీవెన్స్ లో కొన్ని ఫిర్యాదులు....**

లక్ష్మీదేవి పల్లి మండలం గట్టు మల్ల గ్రామపంచాయతీ పరిధిలోని గంగమ్మ కాలనీ కి చెందిన గిరిజన ప్రజలు గత 15 సంవత్సరాలుగా గంగమ్మ కాలనీలో నివాసముంటున్నామని, గట్టు మల్ల గ్రామానికి గంగమ్మ కాలనీకి మధ్య విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, తమ యొక్క పిల్లల ఆధార్ కార్డు జారీ చేయడానికి జనన ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సిందిగా అధికారులు సూచించారని, కానీ తమకు ఆ విషయం తెలియక ఇప్పటివరకు జనన ధ్రువీకర పత్రాలు తీసుకోలేదని కావున మా సమస్యను పరిష్కరించి తమ పిల్లలకు ఆధార్ ధ్రువీకరణ పత్రాలు ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం ఈ ఈ ఎన్పీడీసీఎల్ మరియు డి సెక్షన్ సూపరిడెంట్ కు ఎండార్స్ చేశారు.

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని కూలీ లైన్ లో నివాసం ఉంటున్న పరిమళ్ళ సుదర్శన్ రావు %ం/శీ% లేటు వీరయ్య తమ యొక్క ఇంటి పట్టా రెగ్యులైజేషన్ లో తమ యొక్క ఇంటి పూర్తి విస్తీర్ణం 128 చదరపు గజాలు కాగా 58.99 చదరపు గజాలు అని డీడ్ ఆఫ్ కన్వీనియన్స్ పట్టా ఇచ్చినారని, కావున సవరణ చేసి డీడ్ ఆఫ్ కన్వీనియన్స్ ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం కొత్తగూడెం తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు.

పాల్వంచ మండలం జగన్నాధపురం లో నివాసం ఉంటున్న బానోత్ లక్ష్మి %ఎ/శీ% లేటు బానోత్ ఈరు తన భర్త అనారోగ్యం కారణం చేత మరణించారని, వితంతువు అయిన తనకు కుటుంబ పోషణ భారంగా ఉందని తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాల్సిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం డి ఆర్ డి ఓ కు అండర్స్ చేయడం జరిగింది.

జూలూరుపాడు మండలం జిపిఎస్ ట్రైబల్ వెల్ఫేర్ ఎల్.ఎల్.బి తండ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా మంచినీటి, విద్యుత్, ఫ్లోరింగ్ మరియు మరుగుదొడ్ల రిపేరు చేసి ఉన్నామని కానీ ఇప్పటివరకు పనులకు సంబంధించిన నిధులు మంజూరు కాలేదని కాంట్రాక్టర్ రాములు చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం పివో ఐ టి డి ఏ కు ఎండార్స్ చేశారు









# ప్రభాత్ నగర్‌లో సిపిఐ గ్రామ శాఖ మహాసభ

- పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం





**పాల్వంచ రూరల్ ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ మండల పరిధి లోని ప్రభాత్ నగర్ లోగల రేగు కృష్ణమూర్తి ఇంటి వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గ్రామ శాఖ మహాసభను సోమవారం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ కమ్యూనిస్టులు విశాల దృక్పథం కలిగి ఉంటారన్నారు. సిపిఐ పార్టీ భారతదేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిందని, ఇప్పటి వరకు దేశంలో ఏ పార్టీ 100 సంవత్సరాల చరిత్ర కలిగి లేదన్నారు. ప్రజలలో మమేకమై అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో 10 లక్షల ఎకరాలు భూస్వాముల భూములు పేదలకు పంచిపెట్టిందన్నారు. తర్వాత కాలంలో ఎత్తుగడల పేరుతో ఎర్రజెండా పార్టీలుగా కొన్ని సంస్థలు ఏర్పడినా అవి చివరకు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందన్నారు. పేద ,మధ్యతరగతి ప్రజలుఅనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని, వారి తరఫున పోరాడి సమస్యలు పరిష్కరించేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందన్నారు. సభలో 15 మందితో నూతన శాఖ సభ్యులను ఎన్నుకొన్నారు. శాఖ కార్యదర్శిగా బోళ్ల ఉపేందర్ రెడ్డి సహాయ కార్యదర్శులు గా రేగు కృష్ణమూర్తి, గొనె క్రాంతి లను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సభలో సిపిఐ పార్టీ పాల్వంచ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, సిపిఐ మండల నాయకులు నిమ్మల రాంబాబు, శనిగారపు శ్రీనివాసరావు, ఆవుల సతీష్, వేల్పుల లింగయ్య, జి వెంకన్న, చారి, సోమ రామిరెడ్డి, తిరుమ రెడ్డి, నారాయణరెడ్డి, వడ్లకొండ అనిల్, రేగు హేమలత, బోళ్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా దయాకర్ రెడ్డి జన్మదిన వేడుక





**కొత్తగూడెం ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మేనల్లుడు, కాంగ్రెస్ నాయకులు ఖమ్మం క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఆయనను ఖమ్మం మంత్రి క్యాంపు కార్యాలయం లో గజమాలతో శాలువలతో ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆళ్ల మురళి, పెదబాబు, చీకటి కార్తీక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవి ప్రసన్న,మండే హనుమంతరావు, శ్రీనివాస్ రెడ్డి, పూణెం శ్రీనివాస్, డిసిసి జిల్లా మైనార్టీ కార్యదర్శి గౌస్, రజాక్, సత్యనారాయణ రెడ్డి, పీతాంబరం, చింతలపూడి శేఖర్, కేకే, వాసు, సుందర్, రుక్మిణి, మసూద్ భాయ్, రాము, పవన్, తదితరులు పాల్గొన్నారు

# తెలుగుదేశం పార్టీ కార్యకర్త కొండ్రు నాగులు మృతి

## అంతిమ సంస్కారానికి రూ.10 వేలు అందజేత

## నివాళులు అర్పించిన నాయకులు

## కట్రం స్వామిదొర

**అన్నపురెడ్డిపల్లి ఫిబ్రవరి 10 నవభూమి:** మండల పరిధిలోని తాటి బుచ్చన్నగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్యకర్త కొండ్రు నాగులు అనారోగ్యంతో సోమవారం తన స్వగృహంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అశ్వారావుపేట నియోజకవర్గ టిడిపి పార్టీ ఇంచార్జి కట్రం స్వామి దొర కొండ్రు నాగులు భౌతిక కాయానికి నివాళు లు అర్పించారు. మృతుడు కొండ్రు నాగులు ఇటీవల తెలంగాణ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో అంతిమ సంస్కారాలు ఖర్చుల నిమిత్తం పార్టీ సభ్యత్వం నిబంధనలు ప్రకారం సంక్రమించే రూ.పది వేలు అతని కుటుంబ సభ్యులకు కట్రం స్వామి దొర అందజేశారు. టిడిపి పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తిని శ్రీను, బొద్దిపోగు అంజి, కీసర విజయ్, కుంజా వెంకట్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు





# దివ్యాంగుల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దివ్యాంగులతో చర్చించిన కలెక్టర్



**ఖమ్మం నవభూమి బ్యూరో, ఫిబ్రవరి10:** దివ్యాంగుల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు తమ సమస్యలు తెలుపుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి వినతి పత్రాన్ని అందించి ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నందు ఆటో స్టాండ్ ఒకే సంఘానికి కాకుండా వివిధ సంఘాలకు లేదా టెండర్ రూపంలో ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో బిజీ సెంటర్ లలో స్ట్రీ టీ స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని, పేద, దివ్యాంగ మహిళలకు కూడా టీ స్టాల్స్ కేటాయిస్తామని, వివరాలు అందించాలని సూచించారు. దివ్యాంగుల కుటుంబ పరిస్థితులను, స్థితిగతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే ఇందిరమ్మ ఇండ్లలో కూడా దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ద్వారా విడతల వారీగా ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. స్వయం ఉపాధి క్రింద యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి గల దివ్యాంగుల పేర్లు, దరఖాస్తులు అందించాలని, మహిళలు ఎవరైనా ఉంటే మహిళా శక్తి క్రింద అందిస్తామని, పురుషులకు ఇతర పథకాల క్రింద, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. స్వయం ఉపాధి యూనిట్ల గ్రౌండింగ్ కంటే ముందే దివ్యాంగులు ఏర్పాటు చేసే వ్యాపారం పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిల్లాలో మహిళా శక్తి క్రింద మహిళలకు వ్యాపారాలు చేయడం పట్ల శిక్షణ అందిస్తున్నామని, ఆసక్తి గల దివ్యాంగులు ఉంటే వారికి కూడా లాభసాటిగా వ్యాపారాలు చేయటం, అవసరమైన అనుమతులు, పెట్టుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ అందించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేశామని, దివ్యాంగుల సహాయార్థం ప్రత్యేకంగా సిబ్బందిని సైతం నియమించడం జరిగిందని అన్నారు. నగరంలో వచ్చే మాల్స్, ఇతర నిర్మాణాలకు కూడా ర్యాంపులు ఉంటేనే అనుమతులు జారీ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, ఉపాధి కల్పనకు గల అవకాశాలపై దివ్యాంగులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు





# పలు శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే జారే

**ములకలపల్లి ఫిబ్రవరి 10 నవభూమి:** ములకలపల్లి మండలంలో పలు శుభకార్యలలో పాల్గొన్న అశ్వరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ. ముందుగా చాపరాలపల్లి గ్రామంలో రామాలయంలో శంకుచక్రాల పునః ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, గుట్టగూడెం గ్రామంలో సున్నం రాజు కృష్ణవేణి దంపతుల కుమార్తె ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. మండల కేంద్రంలో బిక్షపతి మనవడి బారసాల వేడుక మరియు మూక మామిడి గ్రామంలో తమ్మిశెట్టి జానీబాబు మనవడి బారసాల వేడుకలలో పాల్గొని చిన్నారులను దీవించారు. జగన్నాథపురం గ్రామంలో కొబ్బరిపాడు గ్రామానికి చెందిన కోండ్రు అశోక్ నూతనంగా నిర్వహించబోయే ఆర్యన్ హెయిర్ స్టైల్ షాప్ నీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ జెడ్పిటిసి బత్తుల అంజి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతయ్య గూడెం మాజీ సర్పంచ్



కారం సుధీర్ నాయకులు గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, సురభి రాజేష్, సాయి మరియు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో టాలెంట్ టెస్ట్: భాస్కర విద్యార్థుల ప్రతిభ






**ఎర్రుపాలెం, నవభూమి,ఫిబ్రవరి 10:** అక్షర నిర్మాణ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జీకే టాలెంట్ టెస్ట్ మరియు స్పెల్బీ పరీక్షలలో మండల పరిధిలోని మీనవోలు శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను రాష్ట్ర స్థాయి అవార్డులను పొందారని కరస్పాండెంట్ బి సూర్యనారాయణ డైరెక్టర్ వెంకటేశ్వరావు తెలిపారు. టాలెంట్ టెస్టో సీనియర్స్ విభాగంలో పాల్గొని బహుమతి పొందిన వేముల కొండ వెంకట కృష్ణ,పింగళి భువనేశ్వర్ రెడ్డి, బయలుపాటి అజయ్ కుమార్, చీరాల నిషాంత్ జూనియర్స్ విభాగంలో ఎస్ కే ఆసిఫ్,బొగ్గుల అశ్విత రెడ్డి,శీలం గౌరీ ప్రియ వేపూరి ప్రణీత ఉత్తమ స్థానంలో నిలిచారన్నారు. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కవి,గాయకుడు జయరాజు,ప్రముఖ రచయిత తెలంగాణ అవార్డు యశ్పాల్ చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులు తీసుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన ఈ అవార్డు ఫంక్షన్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థ లను శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ భట్లపెనుమర్తి సూర్య నారాయణ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపల్ వైస్ శ్రీదేవి,ఇబ్రహీం,తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

## అల్పాహారాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆదినారాయణ





**దమ్మపేట ఫిబ్రవరి 10 నవభూమి:** దమ్మపేట మండలం గండుగులపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పర్యటించి రెడ్యాలపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు నూతనంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులు పరిశీలించారు. అనంతరం గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్చి 21 నుంచి పదవ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఉదయం అదనంగా క్లాసులు నిర్వహిస్తూ సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేకంగా అందించే అల్పాహారం మెనూ పరిశీలించారు.

## మణికుమార్‌ను అభినందించిన ఎంఈఓ



**ఎర్రుపాలెం,నవభూమి,ఫిబ్రవరి 10:** జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలలో మండల పరిధిలోని మీనవోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి చదువుతున్న నంద్రు మణి కుమార్ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం విజేతగా నిలిచాడు.జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రశంస పత్రం అందుకున్నారు.సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మణికుమార్ ను గ్రామ పెద్దలు,ఏఏపీసి చైర్మన్, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ,గ్రామస్తులు, అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా మణికుమార్ అన్ని పోటీల్లో పాల్గొని మరింతగా రాణించాలని ఆకాంక్షించారు


## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల కష్ట సుఖాలలో తోడుగా ఉంటూ

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, నవభూమి ప్రతినిధి-** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ సమాచార గృహ నిర్మాణ శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి కి బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా లింగాల రవికుమార్ మాట్లాడుతూ తుంబూరి దయాకర్ రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల కష్ట సుఖాలలో తోడుగా ఉంటూ ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని లింగాల అన్నారు

# పెద్దమ్మ గుడిలో వైభవంగా శ్రీ శివాలయ ప్రతిష్ట

- **మహా కుంభాభిషేక మహోత్సవాలు వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

**పాల్వంచ టౌన్ ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశ్వాపురం - జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) లో సోమవారం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ శివాలయంలో శ్రీ స్వామివారి పరివార దేవత సహిత జీవధ్వజ పంచాహ్నిక దీక్ష ప్రతిష్టాపన అమ్మవారి పంచమ పుష్కర పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవ ము దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం వీరస్వామి పర్యవేక్షణలో జగద్గురు శృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులతో తాండవ కాశీ క్షేత్రం తపోవనం ధర్మపురి పీఠాధిపతులు అనంత శ్రీశ్రీశ్రీ సచ్చిదనంద సరస్వతి స్వామి వారి చేతుల మీదుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, కర్మణ పుణ్యాహవాచనము, అధివాసము హెూమం గర్తన్యాసము, ధాతున్యాసము నూతక్కి శ్రీనివాసరావు రాజకుమారి దంపతులచే నిర్మించబడిన కళ్యాణ మండపం, అన్నదాన సత్రముల ప్రారంభం 11 గంటల 30 నిమిషాలకు స్థిర మంత్ర, విగ్రహ శిఖర ప్రతిష్ట, అనంతరం కళాన్యాసం, కళా ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, దృష్టి కుంభం, ధేను దర్శనం, మధ్యాహ్నం అమ్మవారి ఆలయం లో పంచమ పుష్కర మహా కుంభాభిషేకం నిర్వహించారు. మహా పూర్ణాహుతి పండిత సత్కారం, మహా అన్నదానము నిర్వహించారు. ఈ ప్రతిష్ట కార్యక్రమమునకు, శివలింగం, పానుమట్టం, గణపతి పీఠము, సుబ్రహ్మణ్యస్వామి పీఠము, సూర్యుడు బలిపీఠము, ద్వార పాలకులు, స్వామివారికి మకర తోరణం కళ్యాణమునకు, పట్టు వస్త్రాలు, మంగళ సూత్రాలు, కొత్తగూడెం మాజీ శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు ధ్వజస్తంభము, మహిపతి రామలింగం, సరస్వతి, లక్ష్మీదేవి, బాదర్ల బాబూజీ, అన్నపూర్ణాదేవి, సందు పట్ల శ్రీనివాస్ రెడ్డి, దేవతామూర్తులకు యంత్రములు త్రి కూలేశ్వరుడు, దీపాలు హారతులు, నాగాభరణం, ఇత్తడి ధారా పాత్ర, నండూరి శ్రీనివాస్, వెండి ధర పాత్ర బిక్షపతి, వెండి నాగాభరణం, సంకా వెంకటేశ్వరరావు, నంది వాహనం, పెండ్యాల సతీష్ అందజేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్. వి. పాటిల్, దేవాలయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం. వీరస్వామి, జాయింట్ కలెక్టర్డి.వేణుగోపాల్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కనకదుర్గ దేవస్థానమునకు అనేకమంది దాతలు, భక్తులు, మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు హాజరైనారు. సాయంత్రం ప్రత్యేక కళ్యాణ వేదికపై శ్రీ శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించామనిదేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి తెలిపారు









# మా పట్టా భూమిని ఆక్రమించేందుకు ఫారెస్ట్ వారి కుట్ర?

- **తగరం నాగయ్య కుటుంబ సభ్యుల ఆరోపణ!**
- **కోర్టు ఆర్డర్లు సైతం ఉన్నా వేధింపులు తప్పడం లేదు!**
- **మా పట్టా భూమికి ప్రభుత్వం రక్షణ కల్పించాలి**





**అశ్వారావుపేట రూరల్ ఫిబ్రవరి 10 నవభూమి:** పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా డ్రైనేజీ నిర్మాణంలో ఫారెస్ట్ చెక్ పోస్ట్ ను ఆర్ అండ్ బి శాఖ వారు కూల్చేసరికి, ఫారెస్ట్ వారు మా పట్టా భూములోకి వచ్చేందుకు ప్రయత్నం చేస్తూ మాపై దౌర్జన్యం చేస్తున్నారని ప్రభుత్వం తగు చర్య తీసుకుని మాకు రక్షణ కల్పించాలని పేరాయిగూడెంకు చెందిన తగరం నాగయ్య కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అశ్వారావుపేట పట్టణంలో రింగు రోడ్డుకు అనుకున్న పాత గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంతంలో సుమారు 60 సంవత్సరాల క్రితం నుండి 1167 సర్వే నెంబర్లో 11 కుంటల భూమికి పట్టా హక్కులు కలిగి ఉండి అనుభవిస్తున్నామని, ఇట్టి భూమికి మార్చి 17 2004 న సత్తుపల్లి కోర్టులో ఐ ఎ నెంబర్ 310 /2003 ఓఎస్ నెంబర్ 53 /2003 తో జడ్జిమెంట్ పొంది ఉన్నామని, 2022 మార్చి 30న, 2024 అక్టోబర్ 29న కోర్టులు ఇచ్చిన ఆర్డర్లు సైతం ఉన్నాయని, ఈ భూమిలో తగరం నాగయ్య కుమారులు, కుమార్తెలైన తగరం వెంకటేశ్వరరావు, తగరం తిరుపతయ్య, తగరం ఏసురత్నం, బండి తిరుపతమ్మ, కాటూరి దుర్గమ్మ లు ఇట్టి భూమిని అనుభవిస్తున్నామని, ఫారెస్ట్ వారికి ఎటువంటి ఆధారాలు లేకపోయినా రేంజర్లు మారినప్పుడల్లా మమ్ములను వేధింపులకు గురి చేస్తూ మీ హక్కు పత్రాలు చూపించండి అంటూ దౌర్జన్యం చేస్తూ మమ్ములను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తగరం నాగయ్య కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు రోడ్డు విస్తరణ పనుల్లో గతంలో మా భూమిని ఆక్రమించుకొని నిర్మాణం చేసిన ఫారెస్ట్ చెక్ పోస్ట్ కూల్చేసరికి, మరలా మరొకసారి మా పట్టా భూమిని ఆక్రమించేందుకు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు ప్రయత్నాలు చేస్తున్నారని, మా పూర్వీకులు నిర్మాణం చేసిన పెంకుటిల్లును కూల్చేసి ఫారెస్ట్ వారు ఆక్రమించాలని చూస్తున్నారని అటువంటి చర్యలు మానుకోవాలని తగరం నాగయ్య కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మేము దళిత కుటుంబానికి చెందిన వారమని, ఏమి చేసినా చెల్లుతుందిలే అనే భావనతో మా పైకి ఫారెస్ట్ వారు దౌర్జన్యానికి వస్తున్నారని, మాకు ఉన్నదే కొంచెం భూమి అని, ఈ భూమిని కూడా మాకు దక్కకుండా చేయడానికి ఫారెస్ట్ వారు ప్రయత్నం చేస్తున్నారని, కోర్టు ఆర్డర్ ఉన్నప్పుడు కోర్టులో తేల్చుకోవాలి కానీ, మాపై దౌర్జన్యం చేయటం ఏమిటని, ఫారెస్ట్ వారికి ఆధారాలు ఉంటే, రెవెన్యూ వారికి పోలీసు వారికి చూపించాలని, లేనిచో మాపై వేధింపులు, మా భూమిని ఆక్రమించే ప్రయత్నాలు మానుకోవాలని, వెంటనే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని మాకు రక్షణ కల్పించాలని తగరం నాగయ్య కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు

# అనారోగ్యంతో గుండాల విలేకరి మృతి



**గుండాల ఫిబ్రవరి 10 నవభూమి:** గత పది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న రిపోర్టర్ సంతోష్ కుమార్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. గుండాల మండల కేంద్రానికి చెందిన రాచకొండ సంతోష్ కుమార్ (30) గత పది సంవత్సరాల కాలం పాటు వివిధ పత్రికలో పనిచేస్తున్నాడు. ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఖమ్మం, వరంగల్ పట్టణంలో వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఖమ్మం ప్రవేట్ ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుడు మండలంలో ప్రతి ఒక్కరికి సుపరిచితుడు కావడంతో కంటతడి పెట్టారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.

# అక్రమ ఇసుకను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు



**ములకలపల్లి ఫిబ్రవరి 10 నవభూమి:** ములకలపల్లి మండలంలోని సీతారామపురం గ్రామపంచాయతీ పరిధిలో గల వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుంది అని సమాచారంతో వెళ్లి అక్రమ ఇసుక నిల్వలను స్వాధినపరుచుకున్న రెవిన్యూ అధికారులు. సోమవారం నాడు విశ్వాసనీయ సమాచారం మేరకు తహసిల్దార్ ఆదేశాల ప్రకారం మండల గిర్ధావర్ బాదావత్ భద్రు ఇసుక నిల్వల ప్రదేశానికి వెళ్లి తనిఖీ చేయగా సుమారు 7 ట్రాక్టర్ల అక్రమ ఇసుక ట్రిప్పులు నిల్వలను గుర్తించి అక్రమ ఇసుక నిల్వల విషయాన్ని తాసిల్దార్ కి తెలియపరచి, ఆ ఇసుకను తహసిల్దార్ కార్యాలయానికి ఒక లారీ సహాయంతో తరలించరు

# ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ దుర్మరణం



**ఎర్రుపాలెం,నవభూమి,ఫిబ్రవరి 10 :** మండల పరిధిలోని మీనవోలు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ తాను నడిపే ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది.ఎస్సై పి.వెంకటేష్ తెలిపిన కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,ఎన్టీఆర్ జిల్లా,మైలవరం గ్రామానికి చెందిన వేముల లక్ష్మయ్య (45) సోమ వారం ఉదయం ట్రాక్టర్ నడుపుకుంటూ ఎర్రుపాలెం నుండి మధిర వెళ్లే క్రమంలో మీనవోలు సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పిరోడ్డు పక్కన ఉన్న మట్టి కుప్పను ఎక్కడంతో డ్రైవింగ్ సీట్లో ఉన్న లక్ష్మయ్య ఎగిరి కింద పడటంతో ట్రాలీ టైర్ అతని మీదగా పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడని,మృతునికి భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు.సంఘటన స్థలా నికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు

# 16000 మెగావాట్లకు చేరువలో విద్యుత్ డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, నవభూమి ప్రతినిది–** వేసవి యాసంగి పంటల ప్రభావంతో రాష్ట్రంలో భారీగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్. గతేడాది మార్చిలో వచ్చిన అత్యధిక డిమాండ్లు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎదుర్కొంటున్న తెలంగాణ విద్యుత్ సంస్థలు గత ఏడాది మార్చిలో ఏర్పడిన రికార్డు స్థాయి అత్యధిక డిమాండ్ 15623 మెగావాట్లు.

# శివాలయ విగ్రహ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న మాజీ మంత్రి వనమా

- స్వామి వారి విగ్రహాలు, మకర తోరణాలను స్వయంగా, ఊరేగింపుగా తీసుకొచ్చిన వనమా
- పాల్గొన్న వనమా కుటుంబ సభ్యులు







**పాల్వంచ ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** మండల పరిధి లోని కేశవపురం, జగన్నాధంపురం గ్రామాల మధ్య కొలువు తీరిన శ్రీ కనకదుర్గ దేవాలయం (పెద్దమ్మ గుడి) ప్రాంగణం లో నూతనం నిర్మించిన శివాలయం లో సోమవారం విగ్రహ ప్రతిష్ట, ధ్వజ స్తంభం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కొత్తగూడెం మాజీ శాసన సభ్యులు, మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా వెంకటేశ్వర రావు తమ కుటుంబ సమేతంగా నూతనంగా నిర్మించిన శివాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతే కాకుండ ఆలయం లో నిర్వహించిన శివ కళ్యాణానికి పట్టు వస్త్రాలను వనమా కుటుంబ సభ్యులు బహుకరించారు. శివాలయం లో స్వామి వారి విగ్రహాలు, మకర తోరణాలను స్వయముగా, ఊరేగింపుగా వనమా కుటుంబ సభ్యులు తీసుకొని వచ్చారు. నూతనంగా నిర్మించిన శివాలయంలో నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొనేందుకు ఆలయానికి చేరుకున్న వనమా తో పాటు అయన కుటుంబ సభ్యులకు పలువురు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్బంగా మాజీ మంత్రి వనమా ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని, కొత్తగూడెం నియోజకవర్గం లోని ప్రజలను చల్లగా చూడాలని స్వామి వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమలో వనమా సతీమణి పద్మావతి, పెద్ద కుమారుడు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేంద్రరావు, అయన సతీమణి బేబీ సరోజినీ, చిన్న కుమారుడు వనమా రామకృష్ణరావు, అయన సతీమణి, మనవడు, మనుమరాళ్లు తదితరులు పాల్గొన్నారు

# మా జీతాలు మాకు ఇచ్చే వరకు పోరాటం విరమించం

- 10 కిలోమీటర్ల పాదయాత్రతో కలెక్టర్ వద్ద కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన పంచాయతీ కార్మికులు
- సమ్మె విరమించండి: త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం డిపిఓ చంద్రమౌళి




**కొత్తగూడెం ఫిబ్రవరి 10 నవభూమి ప్రతినిధి:** గత పది రోజుల నుండి లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో ఉన్న ఆరు పంచాయతీల కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ సమ్మె సందర్భంగా అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారికి ఇస్తున్న జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నేడు కలెక్టరేట్ వద్ద ధర్నాను నిర్వహించడం జరిగింది. ముందుగా లక్ష్మీదేపల్లి మండల కేంద్రం నుండి గ్రామపంచాయతీ కార్మికులు అఖిలపక్ష పార్టీల నేతలు పాదయాత్రతో సోమవారం ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. అనంతరం కలెక్టర్ వద్ద ధర్నా సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ అధ్యక్షతన సభ నిర్వహించడం జరిగింది. ఈ సభలో సిపిఎం సిపిఐ విఆర్ఎస్ ఆదివాసి సంఘాల, అఖిలపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ... సంపూర్ణ మద్దతు తెలిపారు. సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఉప్పనపల్లి నాగేశ్వరరావు సిపిఐ నాయకులు లగడపాటి రమేష్, డిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎస్కే అన్వర్ పాషా, ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ వాసం రామకృష్ణ దొర తదితరులు మాట్లాడుతూ

గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్య ప్రధానంగా వారి నెలవారి ఇచ్చే జీతాలు కోత పెట్టకుండా ప్రతి నెల చెల్లించే విధంగా కేటగిరీలా వారిగా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. గత పది రోజుల నుండి సమ్మె నిర్వహిస్తున్నప్పటికీ అధికారుల్లో చలనం లేదని వారు విమర్శించారు వారికి ఇవ్వాల్సిన జీతాలు 12600 నుండి కేటగిరీల వారీగా 17000 వరకు ఇవ్వకుండా అధికారులు ఒంటెద్దు పోకడ పోతూ వారు జీతాల్లో కోత విధించి 9500 మాత్రమే చెల్లించే విధంగా నిర్ణయం చేయడం సరైనది కాదని విమర్శించారు ప్రతి నెల ఇచ్చే జీతాల్లో కోతలు పెట్టడం వల్ల కుటుంబ పోషణ ఎలా గడుస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారి జీతాలు వారికిచ్చే వరకు సమ్మె విరమించేది లేదని కార్మికులకు అండగా వెన్నంటే ఉంటామని అఖిలపక్ష పార్టీల నేతలు హామీ ఇచ్చారు ఈ సమ్మె పోరాటానికి ప్రజలందరినీ సమావేశం చేసి సమాయత్తం చేసి ఆందోళనలో ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు ఈ పోరాటం ఒక్క మండలానికి పరిమితం కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గానికి న్యాయం చేసే వరకు పోరాటం కుల సహిస్తామని అఖిలపక్ష పార్టీల నేతలు ప్రకటన చేశారు.

కలెక్టర్ వద్ద జరుగుతున్న పోరాటానికి దిగివచ్చిన డిపిఓ చంద్రమౌళి జిల్లా గ్రామపంచాయతీ అధికారి

గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న పోరాటానికి దిగివచ్చి డిపిఓ చంద్రమౌళి మాట్లాడుతూ కార్మికులు వారి వేతనాలు సమస్య పట్ల రాష్ట్ర కమిషనర్ కి ఫిర్యాదు చేశామని కలెక్టర్ గారి చొరవతో త్వరలోనే సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు జీతాలు తగ్గించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు తప్పకుండా అధికారులుగా మేము పాటించాలని అధికారులు గమనించాలని వారు కోరారు.

కార్మికుల జీతం ఇచ్చేవరకు సమ్మెను కొనసాగిస్తాం: సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ అధికారులు గతంలో ఇచ్చిన మాదిరిగానే జీతాలు ఇవ్వాలని, లేదంటే యధావిధిగా నే సమ్మె కొనసాగుతుందని భూక్యా రమేష్ స్పష్టం చేశారు.

